1

# మందిలో మనిషి

కండబలంలో భీముడు సార్థకనామడే. గుండెబలంలో అయితే... ఉత్తరకుమారుడని అనలేం గాని, ఈ రెంటికీ భిన్నమైన - యోగిలాంటి మనస్తత్వం అతన్ది. నివాసానికి-నగరాల్లో సమశీతల భవనాలూ, భోజనానికి-పంచభక్ష్య పరమాన్నాలూ యోగులకు యోగ్యాలు కావు మరి! కాబట్టి ఈ యోగి ఆధునిక నాగరకతకు 'నన్నంటకుమీ' అన్నంత దూరంలో వున్న ఓ పల్లెటూళ్ళో, వూరికి దూరంగా ఓ పూరి గుడిసెలో నివాసం వుంటున్నాడు. ఈ వ్యవస్థ చేసిన యోగికి కందమూలాలు కూడా కరువేగాబట్టి ఏ కలోగంజో తాగి పడుకొంటో వుంటాడు. ఇప్పుడున్న మానసిక స్థితిని బట్టి అదికూడా తాగివుండడని అనుకోవాలి. అయినా ఆరోగ్యంగా, బలంగా కన్పిస్తూనే వున్నాడు. కష్టజీవుల పట్ల ప్రకృతి చేసే గారడీ ఏమో అది.

భీముడు పడుకున్నాడు.

కప్పుమీది కంతలు కన్పిస్తున్నై. అందులోంచి వెన్నెల అతని గుండెల్లో యీటెలా పొడుస్తోంది. అతని మనసులో భీకర సంగ్రామం సాగుతోంది.

అతనికి కొంచెం దూరంలో తల్లి కొబ్బరితాడుతో నేసిన కుక్కిమంచంలో పడుకుని వుంది... ఆమె మీద వెన్నెల తుంపర కురుస్తోంది. ఆమె నిద్రపోతోందో, మేలుకునే వుందో కనుక్కోవటం కష్టం. ఈ రెండు అవస్థల్లోనూ ఆమె ఒకలాగే కన్పిస్తుంది. వెతల వొత్తిడికి వాలిపోయిన కనుబొమలు ఆమెను ఉభయావస్థల్లోనూ ఒకేలా కన్పింపచేస్తాయి. వయసు భారానికి ఒంగిపోయిన ఆమె నడుం కుక్కి మంచానికి కుదురుగా అమరింది. కడగండ్ల కాలం ఆమెను కన్నీటితో కడిగేస్తే ఒళ్ళంతా తెల్లగా పాలిపోయింది.

ఇద్దరి కళ్ళూ మూసుకునే వున్నాయి. మనసులు మాత్రం తెరుచుకుని ఆలోచిస్తున్నాయి. అలా వాళ్ళు అశాంతికి గురై, నిద్రకు వెలియై సజీవశవాల్లాగ పడి వున్నారు.

ఈ అవస్థ వాళ్ళకు యీనాటిది కాదు. వాళ్ళలోని మూడో వ్యక్తి రాజమ్మ ఆ వూరి మోతుబరి రైతు మూడో కొడుకుతో కాపరం పెట్టినప్పటి నుంచీ వుంది. ఆమె మీద హత్యానేరం మోపి పోలీసులు ఆమెను జైల్లోకి నెట్టేశాక అది కొంచెం పెరిగింది. ఆమె జెయిల్లో కొడుకుని కన్నదని విన్నాక మరింత ప్రజ్వరిల్లింది. ఇప్పుడు - అతను సంపన్న కుటుంబంలోని మరో అమ్మాయిని పెళ్లాడబోతున్నాడని విన్నాక, రాజమ్మ కొడుకు అసలు అతని వారసుడే కాదని వూరి నేతలు తీర్పియ్యబోతున్నారని తెలిశాక పతాకస్థాయికి చేరుకుంది.

రాజమ్మ పట్నంలో ఒక ఆశ్రమంలో పెరిగింది. అది మామూలు ఆశ్రమం కాదు. ఆధునిక సామాజిక విజ్ఞానానికి ఆటపట్టు. అందుకే ఆమెలో హేతువాదం, శాస్త్రీయ దృక్పథం బాగా చోటు చేసుకున్నాయి.

ఆమె మనసూ, వయసూ సమవుజ్జీగానే పెరిగాయి. ఆమె అందం అందానికే అందంలా అన్పిస్తుంది. ఆమె సొంపులు సౌందర్యాన్ని సానబెట్టే సొంపులు. అప్పుడప్పుడూ చుట్టం చూపుగా ఇంటికి వచ్చి ఆమె సౌందర్య వీచికల్ని వూరి నిండా వెదజల్లి వెళ్ళిపోతూ వుంటుంది. ఆ తాకిడికి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరై ప్రేమలో పడ్డాడు భాస్కరం.

"పెళ్ళి చేసుకుందాం" అని అడిగాడొకసారి.

"యీ సమాజం, దాని కట్టుబాట్లు- వాటిని ఎదిరించే చేవ మీకుందా?" అనడిగింది రాజమ్మ.

అతనికి అర్థం అయినట్లు లేదు. అతను చదువుకున్నవాడే! కాని ఆమె మాటల్లోని భావాన్ని అర్థం చేసుకోగలిగే విజ్ఞానాన్ని ఆ చదువు ప్రసాదించలేదు.

"మనిద్దరం రెండు విభిన్న వర్గాలకు చెందిన వాళ్ళం. మనం అణుయుగంలో బతుకుతున్నా మన వూరు బానిస సమాజ లక్షణాలను పోగొట్టుకోలేక పోతోంది. అలాంటప్పుడు మన పొత్తు ఈ వూరు - ఊరి మాటకేం లెండి. మీ వారు ఎంత వరకూ సహించగలరు?"

"ఒకళ్ళతో నాకేం పని?"

"అది ఆవేశంలో అన్నమాట. ఆచరణలో అదెంత కష్టమో మీకు తెలీదల్లే వుంది. సంఘంలో బతికే మనిషి సంఘాన్ని కాదని బతకడం కష్టం. అందులో వుండే ఆసంఘాన్ని మార్చే ప్రయత్నం చేయచ్చనుకోండి. కాని అందుకు బోలెడంత మానసికస్థైర్యం, శక్తీ కావాలి."

"నేను నీ కోసం దేవుణ్నయినా ఎదిరించగల్ను."

"లేని వాడిపైన సవాలెందుకులెండి. మీ చుట్టూ వున్న మనుషుల్ని ఎదిరించే శక్తి

వుంటే చాలు. అది వుందా మీకు?"

"ఉంది. ఎవర్నయినా యెదిరిస్తాను. ఎన్ని కష్టాలైనా సహిస్తాను."

"మంచిది. రేపు పెళ్ళిలోనైనా ఈ మాటలేగా మీరనేది?"

"అంటే?"

"అంటే...పెళ్ళిలో వాళ్ళు మన చేత పలికించే ప్రమాణాలు యివేగా, అలాంటప్పుడు ఒకళ్ళ ప్రమేయం లేకుండా వాటికి కట్టుబడి ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకుని కల్సి వుంటే పోలా? మళ్ళీ ఆ తతంగం ఎందుకూ?"

ఇది మరీ బావుందనుకున్నాడు భాస్కరం.

ఊళ్ళో పెనుతుఫాను రేగింది.

భాస్కరం యింట్లో అయితే ఎలాంటి సంచలనం రేగలేదు. అతని తండ్రి ఇద్దర్నీ ఇంటికే ఆహ్వానించేడు.

"ఏమిటీ అన్యాయం" అడిగేరు పెద్దలు.

"మీకు వూరి పెద్దరికం అయితే వుంది గాని బుద్ధిమాత్రం లేదు" అన్నాడు భాస్కరం తండ్రి.

అవునో, కాదో - అన్న మనిషి డబ్బున్న భూస్వామి. సంఘం అతని చేతిలో కీలుబొమ్మ -కిమ్మనకుండా వెళ్ళిపోయారు ఆ పెద్దలు.

రాజమ్మ భాస్కరంతో కాపరం పెట్టిన ఆరు నెలలకి ఆమెకు నక్సలైట్లతో సంబంధాలున్నాయని వూళ్లో పుకారు లేచింది. మరో నెలకి ఓ హత్యానేరంలో యిరికించి ఆమెను పోలీసులు పట్టుకుపోయారు.

రాజమ్మను జెయిల్లో పెట్టేక గాని, జెయిల్లో ఆమెకు కొడుకు పుట్టేకగాని; భీముడు వెళ్ళి చూళ్ళేదు. అలాగని చెల్లెలి మీద అతనికి ప్రేమ లేదని కాదు. ఆమె అతనికి పంచప్రాణం. ఆమెను చూసినా, ఆమె గురించి ఏం తలపెట్టినా వూరినుంచి వెలివేస్తామని కట్టడి చేసింది వూరు. రెక్కల కష్టంతో డొక్కలు నింపుకునే వ్యక్తికి అంత సాహసం యెక్కడిది?

అన్నిటికంటే ఆశ్చర్యం ఏమంటే, రాజమ్మ అరెస్టయాక అసలామె గురించే పట్టించుకోలేదు భాస్కరం. పైగా ఆమెను అసహ్యించు కుంటున్నట్లుగా ప్రవర్తించేవాడు.

ముసలమ్మ కదిలిన శబ్దం చేసింది మంచం. భీముడు అటు తిరిగి ఆమె వైపు చూశాడు-

"భీమన్నా...." పిల్చింది.

"ఊఁ-"

"తెల్లారాక మల్లా ఓసారి యెల్లిరారా ఊళ్ళోకి"

"ఎందుకు?"

"ఎందుకేంటి నాయ్నా? ఆ బాబుల కాళ్లో కడుపో పట్టుకు బతిమాలు. లేకపోతే దాని బతుకేమైపోద్ది?"

"ఏమైపోతే ఎవడిక్కావాలమ్మా! నిన్న మొన్నటి దాకా అన్యాయం అన్న వోళ్ళు డబ్బు మింగేసి ఉప్పుడు ఆడికొమ్మే కాత్తన్నారు. మనం ఏం మొరపెట్టుకున్నా ఆళ్ళ తలకెక్కదు. పైగా జెయిల్లో పెట్టిత్తామని నన్నే బెదిరించారు" అన్నాడు విచారంగా.

మరేం మాట్లాళ్ళేదు ముసలమ్మ.

అలా చాలా సేపు మౌనంగా వున్నారు.

కాస్సేపటికి బయటినించి పిలుపు వినిపించింది. లేచి వెళ్ళేడు భీముడు.

నలుగురైదుగురు యువకులు నిలబడివున్నారు. అందులో అతనికి తెల్సినవాళ్ళు నలుగురే!

"మీతో మాట్లాడాలి" అన్నాడు, అతనికి తెలియని వ్యక్తి.

"మేం పట్నం నించి వొచ్చాం. మీతో మాట్లాడాలి పదండి ఇంట్లోకి."

"తమరు లోపల కూకోలేరండి."

"ఫరవాలేదు."

వాళ్ళే ముందు లోపలకి దూరేరు.

"చూడు భీమన్నా! రేపు నువ్వు ధైర్యంగా నిలబడాలి."

"ఎందుకు బాబూ?"

"ఇప్పుడుకూడా మనం వూరుకుంటే రాజమ్మ బతుకు బండలైపోతుంది."

"ఆమె జీవితం నాశనం అవుతుందని కాదు. అతను ఒదిలేసినంత మాత్రాన ఆమె చెడిపోదు. కాని అది అన్యాయం. అందుకైనా ప్రతిఘటించాలి."

"నా నేం చెయగల్ను బాబూ, పేద ముండాకొడుకుని, ఒంటిరిగాణ్ని."

"అలా అనకండి, మీ వెనక వూరి యువకులంతా వుంటారు. రాజమ్మ మీ ఒక్కరి చెల్లెలే కాదు. మన అందరి తోబుట్టువు."

"సాలు బాబూ! మీరంతా ఆ మాటన్నారు. అంతే సాలు. ఇంక నేను ఏమైపోయినా ఫరవాలేదు. సెప్పండి ఏం చేయమంటారు" అన్నాడు భీముడు ఆవేశంగా.

"రేపు వాళ్ళు పంచాయితీలో పెట్టే ప్రతి తీర్మానాన్నీ ఎదుర్కోవాలి. తిరుగుబాటు ముందు నీ దగ్గర్నుంచి రావాలి. అప్పుడు మేమంతా అందుకుంటాం, సరేనా?"

"సరేలెండి. ఎక్క డేంచెయ్యాలో మాత్రం నాకు సెప్పండి."

దేశానికి స్వాతంత్ర్యం ఒచ్చిన గుర్తుగా ఆ వూళ్ళో వో జండా స్థంబం. దాని వెనుక

ఒక మంటపం. దాంట్లో జాతిపిత మందహాస విగ్రహం వున్నాయి. ఆ వూళ్ళో జరిగే అన్ని అరాచక చర్యలకీ నిర్ణయాలు ఆ గాంధీ మంటపంలోనే జరుగుతూ వుంటాయి.

సభ ప్రారంభమైంది.

"ఈనాటి సమస్య అందరికి తెలిసే వుంటుంది. మన జనార్ధనంగారు తమ మూడో కుమారుడికి వివాహం చేయ నిశ్చయించారు."

ఎవరో భీముడి వీపు గిచ్చేరు. కాని ఏం చేయాలో భీముడికి తోచలేదు.

"అయితే మనందర్నీ భోజనాలకి పిలుస్తున్నారా?" అందుకున్నాడో యువకుడు.

"జనార్ధనంగారి అబ్బాయి పెళ్ళిచేసుకుని తీరాలని ఇక్కడ తీర్మానం చేయాలా" మరొకడు.

"అక్కర్లేదు గాని ఓ లిటిగేసనుంది. లిటిగేసనంటే అంత పెద్దదేం గాదనుకోండి. పోనీ లిటిగేసనే అనుకోండి. ఎంత కాదనుకున్నా కొంత కాలం కలిసి కాపరం చేశారుగా, అదే - రాజమ్మ, భాస్కరం బాబూ కలిసున్నారు గదా! ఆ పిల్లేమో జెయిల్లో వుంది. ఈయ నెంత కాలమని ఒంటిగా వుంటాడు? అందుకని..."

"మీలో ఎవరి భార్య అయినా జైలుకెళ్తే మీరు మరో పెళ్ళి చేసుకుంటారా?"

"మా పెళ్ళాలు బయటికే వెళ్లరు. జెయిలు కెందుకెళ్తారు?"

"పోనీ మొగుడు జైలుకెళ్తే పెళ్ళాం మరోపెళ్ళి చేసుకోవచ్చా?"

"అది ఏ శాస్త్రంలోనూ లేదు."

"మీ శాస్త్రంలో వుందిగా; ఎంతో కాలం ఒంటరిగా వుండలేడు కాబట్టి మరో పెళ్ళి, ఆడది అంతకంటే ఒంటరిగా వుండలేదు మరి!"

అప్పుడు లేచారు జనార్ధనం గారు.

"పెళ్ళి పెళ్ళి అంటున్నారు. అసలు వాడికి పెళ్ళెవరు చేశారు?"

"ఎవళ్ళు చేశారని తీసికెళ్ళి ఇంట్లో పెట్టుకున్నావు?" అని లేచేడు భీముడు.

కాస్సేపు అతని వంక తేరిపార చూశాడు. జనార్ధనం.

"ఎవరు? భీముడే!... ఏంరోయ్ నువ్వా నాయకుడివై పోయావన్న మాట! ఏది?... వీళ్ల అండ చూసుకునేనా?" అన్నాడు వెటకారంగా.

"నాకెవళ్ళ అండా లేదు. ఎవడి పుండు ఆడికే నెప్పి."

"అయితే మరింకనేం ఏం చేస్తావో చెయ్యి మరి!"

"నువు చెయ్యదల్చుకున్నదేదో ముందు చెయ్యి అప్పుడు నేన్జేసేదేదో నేనూ చేస్తాను."

"నా కొడుక్కి పెళ్ళి చేస్తాను. ఎవడాపుచేస్తాడో చూస్తాను."

"ఎవడు చేస్తాడో మేం చూస్తాం" అంటూ నిలబడ్డారు యువకులు.

ఎప్పుడూ చూడని, వూహించని యీ వింత పరిణామానికి విస్తుపోయారు పెద్దలు.

జనార్ధనానికి మతి పోతోంది. వ్యవహారం కాశ్మీరు సమస్యలా బెడిసి కొట్టినందుకు చిందులు తొక్కుతూ –

"ఈ సంఘంతో నాకు పన్లేదు. నాకొడుక్కి రేపే పెళ్ళి చేస్తాను, ఎవడడ్డు వస్తాడో చూస్తాను" అంటూ లేచి వెళ్ళిపోయాడు.

* * *

పెళ్ళి వారు ఆడంబరంగా తరలి పోతున్నారు. పెళ్ళి కొడుకూ, తండ్రీ వెనక కార్లో కూర్చున్నారు. ముఖ్యులు మూడు కార్లలో ముందు పోతున్నారు.

రాత్రి పడింది. అందరికీ మాగన్నుగా నిద్ర పట్టింది. కారు వేగంగా పోతూ అకస్మాత్తుగా ఆగిపోయింది.

జనార్ధనానికి మెలుకు వొచ్చింది.

"ఏవిఁటిది? ఎక్కడి కొచ్చాం. ఏరీ పెళ్లి వారంతా?" అంటున్నాడు.

ఎవరూ మాట్లాళ్ళేదు. డ్రైవర్ డోరు తీసుకుని కిందికి దిగి "భీముడూ.." అని పిల్చేడు.

ప్రత్యక్షమయ్యాడు భీముడు.

డోర్ తీసి,

"లాగు వీళ్ళిద్దర్నీ బయటికి"

ఇద్దర్నీ జబ్బ పట్టుకు బయటకీడ్చేడు భీముడు.

"ఏవిఁటిదంతా..."

"భీముడూ..."

"బాబూ...."

"ఆలస్యం చేయకు కానీయ్"

"అమ్మా..." అంటూ కిందపడి పోయాడు జనార్ధనం.

భాస్కరం పారిపోబోయాడు.

పట్టుకుని రెక్కలు విరిచి కార్లో పారేసి పక్కన కూర్చున్నాడు భీముడు.

కారు చీకటిని చీల్చుకుంటూ అలా ముందుకు సాగిపోయింది కారు.

ఎంతదూరం?

తూర్పున అరుణోదయం అవుపించేటంత దూరం,

*(స్వాతి, మార్చి 1979)*